
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5
# వరంగల్
ఉమ్మడి జిల్లా
గురువారం 1 మే 2025


## సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం రాక!

- హాజరవనున్న నలుగురు మంత్రులు, పలువురు స్వామీజీలు
- ఈనెల 15నుంచి కాళేశ్వరంలో సంరంభం



మహదేవపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల సరిహద్దులో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయి. రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరిగే ఏకైక ప్రాంతం కావడంతో ఇక్కడి పవిత్ర త్రివేణి సంగమం వద్ద పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో 15వతేదీన జరిగే ప్రారంభ కార్యక్రమాలు, పూజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నలుగురు మంత్రులతో పాటు పలువురు స్వామీజీలు హాజరుకానున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే ఓ స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

## ఎస్ఆర్ విద్యార్థుల విజయభేరి

పదోతరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు

అభినందనలు తెలిపిన చైర్మన్ వరదారెడ్డి

6

## వేసవిలో మూత్రపిండాల ఆరోగ్యంపై..



నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్

సంప్రదించాల్సిన సమయం:
ఉదయం 11 గంటల నుంచి
12 గంటల వరకు

ఫోన్ నెంబరు:
70938 47967

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి సమయంలో చాలామంది శరీరంలో నీటి శాతం తగ్గుదల (డీ హైడ్రేషన్)తో బాధపడుతుంటారు. ప్రస్తుతం ఎండవేడిమి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. చాలామందిలో మూత్రపిండాలకు రక్త ప్రసరణ తగ్గుతుండటం కనిపిస్తుండగా.. ఇది మూత్రపిండాలు పాక్షికంగా గానీ, పూర్తిగా గానీ క్షీణించడానికి దారితీస్తుంది. ప్రధానంగా కిడ్నీలో రాళ్లు, మూత్ర నాళాల శ్లేష్మ పొరల్లో ఇన్ఫెక్షన్లు లాంటివి సంభవిస్తాయి. ఈ క్రమంలో ఎండల వేళ మూత్రపిండాల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' గురువారం కేఎంసీ, ఎంజీఎం యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరం రణధీర్‌తో ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. ప్రజలు ఈ ఫోన్‌ఇన్ ద్వారా డాక్టర్ రణధీర్‌ను సంప్రదించి వేసవిలో మూత్రపిండాల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఇతరత్రా కిడ్నీ సమస్యల గురించి తెలుసుకోవచ్చు.

## కార్మిక చట్టాలు.. కాగితాల్లోనే!

నేడు మేడే

- వెట్టిచాకిరీకి గురవుతున్న శ్రమజీవులు
- అమలుకాని కనీస వేతనాలు
- పనిగంటలకు మించి విధులు
- పనికితగ్గ వేతనం పొందని కార్మికులు
- అన్ని రంగాల్లోనూ ఇదే పరిస్థితి
- వలసకార్మికుల పరిస్థితి మరింత దయనీయం

6

# ఎస్ఆర్ విద్యార్థుల విజయభేరి

- ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు
- అభినందనలు తెలిపిన చైర్మన్ వరదారెడ్డి



దీక్షిత్ రెడ్డి, హాసిని, శివచరణ్, శివప్రియ, మణివర్ధన్ రెడ్డి, శివ ప్రియ

హనుమకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో ఈ సారి కూడా జిల్లాలో, రాష్ట్రంలో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు సంచలనం సృష్టించారు. తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. మొత్తం 600 మార్కులకు గాను సక్కర శివప్రియ 586, డి.దీక్షితారెడ్డి 586, ఎం.మనస్విని 585, మణివర్ధన్ 584, శివచరణ్ 584, వి.హాసిని 584 మార్కులు సాధించారు. ఇప్పటివరకు 23మందిపైగా విద్యార్థులు 580 మార్కులు సాధించి రాష్ట్రంలో ఎస్ఆర్ విజయపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణలో పెడుతూ ఒత్తిడి లేని వాతావరణంలో, క్రమశిక్షణ, సృజనాత్మతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థల్లో పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి ఒక బృహత్తర పై పద్ధతిలో ప్రైమ్ స్కూల్స్ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామన్నారు. ఈ అఖండ విజయాన్ని సాధించిన విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# మరోసారి సత్తాచాటిన తేజస్వి



హనుమకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో తేజస్వి పాఠశాల విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో విజయదుందుభి మోగించారు. 590 మార్కులతో మేకల శ్రీనిత్య ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 600 మార్కులకు గాను ఎ.సాయిసిరి 586, పి.ఆహన్య, బి.గౌతమ్ క్రిస్ 584, జి.రిషిక, కె.శ్రీనిధి 583, అయేషా తబుసమ్, పి.హృతిక్ రెడ్డి 581, పి.శృతిక, జి.పవన్ విదేష్, డి.సబరీష్ 580 మార్కులు సాధించారు. 579 నుంచి 570 వరకు 46 మంది, 569 నుంచి 560 వరకు 44 మంది, 559 నుంచి 550 వరకు 50 మంది, 549 నుంచి 540 వరకు 61 మంది విద్యార్థులు తమ సత్తాచాటారు. 539 కంటే తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు 251 మందితో నయీంనగర్, పోచమ్మకుంట, ప్రశాంత్ నగర్ బ్రాంచ్‌లలో జిల్లా స్థాయిలో అధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు పాఠశాల చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి, పిల్లలమర్రి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సంధ్య, జేపీ రావు, సహజ, రాజేందర్, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.



ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన శివాని విద్యార్థులు

## శివాని పాఠశాల విద్యార్థుల హవా

హనుమకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్‌సీ ఫలితాల్లో హనుమకొండలోని శివాని ఉన్నత పాఠశాల, బేబీ సైనిక్ స్కూల్ విద్యార్థులు మరోసారి విజయదుందుభి మోగించారు. రుద్రోజు శ్రేష్ఠ 577, మర్ధ దివిజ 569, అద్దె శ్రీనిత్య 553, అంచురి మనస్వి 551, కుంట మనోజ్ 546, భూపతి అశ్వితారెడ్డి 545, షైన సహస్ర రాగశ్రీ 543, పెద్దిరెడ్డి మణిదీప్ రెడ్డి 539, వల్లాల ప్రణవ్ 539, అలువాలద దీవన్ కుమార్ 538 మార్కులు సాధించారు. రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ టి.స్వామి, డైరెక్టర్లు జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, టి.రాజు ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డితోపాటు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

## త్రివేణి ప్రభంజనం

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి. వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. 593, 590, 587, 586, 584, 583, 582, 581, 580మార్కులు సాధించారని తెలిపారు. 61మందికి 570 పైన, 200 మందికి 550కి, 680 మందికి 500లకు పైగా మార్కు లు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, నీట్, జేఎస్‌వో, ఎన్టీఎస్ఈ ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా విజయం సాధించేలా బోధన చేస్తున్నామన్నారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ విజయాలు సాధించామన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్

## షైన్ విద్యార్థుల విజయదుందుభి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ ఫలితాలలో షైన్ విద్యార్థులు విజయదుందుభి మోగించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని షైన్ కళాశాలలో బుధవారం ఎస్ఎస్‌సీ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్‌లు పి.రాజేంద్రకుమార్, మూగల రమ, ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్, షైన్ ఎర్రగట్టుగుట్ట చైర్మన్ జె.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బి.ఆదిత్య దీక్షిత్‌కు 588, జి.జ్ఞానదీప్ 580, పి.హాసిని, మణికంఠ, రింషా జైనబ్‌లకు 579, సాయిశ్రీ 578, మణిచందనకు 577, కార్తీక, త్రిషికాపటేల్ 576, సంప్రీత్ 575, రాజేష్‌కు 574, సాధించారు. 23మందికి 570కి పైగా, 53 మందికి 560కి పైగా 92 మందికి 550, 371 మందికి 500పైగా మార్కులు సాధించారని తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జి.రాజ్‌కుమార్, పి.విశాల్, ప్రగతిరెడ్డి, కవితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని
# 400 అడుగులలో చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను ప్రతీ లబ్ధి దారుడు 400 అడుగులలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్మాణం చేపట్టిన మోడల్ హౌజ్‌ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే , గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశారన్నారు. రూ. 175 కోట్లతో నియోజకవర్గంలో ఇళ్లను నిర్మాణం చేపట్టబోతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న మూడు సంవత్సరాలలో 18 నుంచి 20లక్షల వరకు ఇళ్ల నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేద వాడికి ఇల్లును మంజూరు చేసి పేద ప్రజల సొంత ఇంటి కలను నెరవేస్తుందన్నారు. ఈ సంవత్సరం జనవరి 26న ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదగా నాలుగు పథకాలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.. క్యాతంపల్లి గ్రామంలో 130 ఇండ్లతో పాటు అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఆత్మీయ భరోసా, రైతు భరోసా మంజూరు అయ్యాయని తెలిపారు. అధికారులు చొరవ తీసుకొని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడానికి సన్న వడ్లకు బోనస్ రూ.500 చెల్లిస్తుందన్నారు. అలాగే 25 లక్షల మంది రైతులకు యేడాదిలో 21వేల కోట్ల రుణామాఫీ చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, తహసీల్దార్ సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, మండల నాయకులు నాగరాజు, నర్సింహరెడ్డి, రమేష్ శరత్ , మాజీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ధర్మసాగర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## 'భూ భారతి' పైలెట్ మండలంలో..
# 4,555 దరఖాస్తులు

500 అర్జీల పరిశీలన పూర్తి

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకు గాను రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు మండలాలుగా ఎంపిక చేయగా.. వాటిలో ములుగు జిల్లా వెంకటాపూర్‌ను ప్రకటించింది. గతనెల 18న మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని రైతులకు భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు పెట్టుకోవాలని వారు సూచించారు. దీంతో అన్నదాతల నుంచి మంచి స్పందన లభించింది. బుధవారంతో దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. మండల వ్యాప్తంగా 4,555 దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీటిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పాత పాసుపుస్తకాలు తీసుకుని కొత్త పాసుపుస్తకాలు (తెలంగాణ) ఇవ్వాలంటూ 900 మంది రైతులు అర్జీ పెట్టుకున్నట్టు తెలిపారు. అందులో సుమారు 500దరఖాస్తులు పరిశీలించామన్నారు. 2014కు ముందు కొనుగోలు చేసి కొత్త పాసు పుస్తకాలు తీసుకునేందుకు మరో 900 దరఖాస్తులు, అసైన్డ్ భూమిని తమ పేర్లపై ఎక్కించాలంటూ సుమారుగా 700, విరాసత్ కింద దరఖాస్తు చేసుకున్న వారు 600 మంది, సర్వే నంబర్లు తప్పుగా నమోదు అయ్యాయంటూ 100 మంది రైతులు, పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పులు, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా ఉన్నాయంటూ 200 మంది రైతులు, ధరణిలో అప్లై చేసుకున్న వారు 600 మంది రైతులు, అన్ని రకాల దరఖాస్తులు కలిపి సుమారు 250 దరఖాస్తులు వచ్చాయని మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం నుంచి 10మంది ఆర్ఐలు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు ఆయా గ్రామాల రైతులకు నోటీసులు పంపి తదుపరి రోజు తమ తమ ఇళ్లకు వెళ్లి వారి ఎదుటే సమస్యలకు పరిష్కారం చూపుతారని, దరఖాస్తు పెట్టుకున్న రైతులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలన్నారు.

## వేసవి క్రీడా శిక్షణకు వేళాయె..

నేటి నుంచి జూన్ 6వరకు ప్రత్యేక శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో చేపట్టనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో చేరడానికి 20 రోజులుగా విద్యార్థుల, చిన్నారులనుంచి దరఖాస్తులను ఆహ్వానించగా, ఏప్రిల్ 28తో గడువు ముగిసింది. దీనికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 1700మందికి పైగా విద్యార్థులు పలు క్రీడాంశాలలో శిక్షణతీసుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్‌కుమార్ వెల్లడించారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో దాదాపు 37రోజులపాటు జేఎన్ క్రీడా మైదానం, జిల్లా పరిధిలోని వివిధ మండల కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేసిందని చెబుతున్నారు.

కాగా, 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 14ఏళ్ల వయస్సు లోపు బాల బాలికలు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చు. ప్రతీ రోజు ఉదయం 6నుంచి 9గంటల వరకు సాయత్రం 4నుంచి 6గంటల వరకు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తారు. దాదాపుగా 20 క్రీడాంశాలలో నిర్వహించనున్న శిబిరంలో అత్యధికంగా అథ్లెటిక్స్, క్రికెట్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, కబడ్డీ క్రీడలో పాల్గొనేందుకు చిన్నారులు ఆసక్తి కనబర్చుతున్నారు. కాగా, శిబిరాలను కలెక్టర్ ప్రావీణ్య గురువారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.



# కార్మిక చట్టాలు.. కాగితాల్లోనే!

నేడు మేడే

- వెట్టిచాకిరీకి గురవుతున్న శ్రమజీవులు
- అమలుకాని కనీస వేతనాలు
- పనిగంటలకు మించి విధులు




హనుమకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : శ్రామిక ప్రజల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం మేడే. కార్మికులంతా అత్యంత ఉత్సాహంతో జరుపుకొనే దీక్షాదినం. ప్రపంచ కార్మికులంతా తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తూ పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేసి.. శ్రమ దోపిడీ నుంచి శాశ్వత విముక్తి కావాలన్న తమ ఆకాంక్షను, అంతిమ లక్ష్యాన్ని పునరుద్ఘాటించే రోజు. ఇందుకోసం ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారు. వారి అసమాన త్యాగఫలంగా వచ్చిందే మేడే. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. ప్రపంచ కార్మికులారా ఏకంకండీ అనే మార్క్స్, ఎంగేల్స్‌లు పిలుపునిచ్చారు. ఆ పిలుపునకు అనుగుణంగానే ఎన్నో దేశాల్లో కార్మిక వర్గ పోరాటాలు జరిగాయి. మహత్తర అక్టోబరు విప్లవం ఫలితంగా తొలిసోషలిస్టు సమాజం ఏర్పడింది. ఆ తర్వాత అనేక దేశాలలో సోషలిస్టు విప్లవాలు, జాతీయ విముక్తి పోరాటాలు విజయవంతమయ్యాయి. కానీ ఇటీవల సోషలిజానికి తీవ్రమైన ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. కార్మికుల శ్రమ శక్తిని దోచుకోవడం ఎక్కువైంది. కార్మికులు, ఇతర శ్రామికులపై ఉక్కుపాదాన్ని మోపుతున్నారు. సంఘటిత.. అసంఘటిత రంగాల శ్రామికుల మొదలు.. మానసిక శ్రమ చేసే ఐటీ రంగ ఉద్యోగుల వరకు అందరికీ నేడు పని గంటల సమస్య ఏర్పడింది. కార్మికుల సంక్షేమానికి తెచ్చిన చట్టాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. 1923లో మొదటి సారి భారత దేశంలో మేడేను పాటించారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచి కార్మిక వర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటి నుంచి మేడేను పాటిస్తున్నారు.

### అన్నిరంగాల్లో శ్రమదోపిడీ..

అన్ని రంగాల్లో శ్రమ దోపిడీ కొనసాగుతూనే ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య తదితర రంగాల్లో కూలీలు, శ్రామికులు, ఉద్యోగులు వెట్టిచాకిరీ చేస్తున్నారు. కార్మిక చట్టాలున్నా అవి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రైవేటు రంగ సంస్థల్లో కార్మికులు, ఉద్యోగులతో నిర్ధేశిత పని గంటలకు మించి పని చేస్తున్నారు. ముఖ్యంగా ఐటీ రంగంలో ఎంతో మంది ఆడపిల్లలు, యువకులు పని చేస్తున్నారు. అసంఘటి రంగంలో ఈ శ్రమదోపిడీ మరీ ఎక్కువగా ఉంది. ఇటీవల ప్రభుత్వ కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోనూ కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. ఉదాహరణకు ఇంటర్మీడియట్ వ్యవస్థలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికం. ప్రభుత్వ రంగంలో పని చేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. విద్యా, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతోంది. వెనకటి స్కూళ్లు 10 నుంచి 14 గంటల వరకు పని చేసేవి. పిల్లలను ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు టీచర్లతో అడ్డగోలుగా పని చేయించుకుంటున్నాయి. ఇచ్చేది తక్కువ జీతమే అయినా 12 గంటలకు మించి పని చేయించుకుంటున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అసంఘటిత కార్మికులూ శ్రమదోపిడీని ఎదుర్కొంటున్నారు. కార్మికశాఖ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పరిశ్రమల యజమానులు కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలన్నిటిలో కార్మికులు నిర్ణీత పని గంటలకన్నా ఎక్కువ సమయం విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇటుకబట్టి కార్మికుల పరిస్థితి మరీ దయనీయం. వారు ఎండా, వానల్లో తడుస్తూ శ్రమిస్తున్నా వారికి ఇటుకబట్టీల యజమానులు తక్కువ కూలి ఇస్తున్నారు. ఇదేంటని అడిగితే మరుసటి రోజు పనిలోకి రానివ్వడం లేదు. ముఖ్యంగా ఇటుకబట్టీల్లో చిన్నపిల్లలతో పని చేయించడం మరీ దారుణం. ఒక పక్క బాలకార్మికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా ఇటుకబట్టీల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది.

### దీనస్థితిలో వలస కార్మికులు

వలస కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. పొట్టకూటి కోసం కుటుంబాలతో సహా ఉపాధి వెతుక్కుంటూ వచ్చిన వారికి పని దొరకడమే గగనమౌతున్న సమయంలో దొరికిన చోట వారు పని చేస్తుండగా.. ఇదే అదనుగా యజమానులు వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. తమ స్వస్థలాలకు తిరిగి వెంటనే వెళ్లలేనివీరు పని స్థలాల్లోనే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకొని కూలీలుగా పని చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులే వీరిలో ఎక్కువ. ఎక్కడ భవన నిర్మాణాలు జరుగుతున్నా అక్కడికి వెళ్లి రోజువారీ కూలీలుగా చేరి రోజంతా చెమటోడుస్తున్నా వారికి చేతికివచ్చే కూలీ తక్కువే. నిర్మాణంలో ఉన్న భవనాల్లోనే టార్పాలిన్లు, ప్లాస్టిక్ రేకులతో తాత్కాలిక షెడ్లను వేసుకొని అందులోనే ఉంటూ రోజంతా శ్రమిస్తున్నారు. కూలీలకు పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించే విషయంలో కార్మిక శాఖ అధికారులు బిల్డర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

### ఉపాధి హామీలో..

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల పరిమాణం తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతోంది. కూలీల దినసరి వేతనాన్ని పెంచుతున్నట్టు ప్రకటించినా వాస్తవానికి ఆ మేరకు అమలు కావడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్మిక చట్టాల ప్రకారం రోజుకు సగటున రూ.300పైగా చెల్లించామని కేంద్రం చెబుతోంది. కానీ వాస్తవానికి సగటున రూ.271మాత్రమే కూలీలకు దక్కింది. తాజాగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉపాధి హామీ కూలీల రోజువారి వేతనాన్ని రూ.300 నుంచి రూ.307కు పెంచింది. ఈ నిర్ణయంతో ఒరిగేదేమీ లేదని కార్మిక సంఘాలు పెదవి విరుస్తున్నాయి. పేదలైన కూలీలకు మేలు జరగాలంటే పని రేటు పెంచి పని పరిమాణాన్ని తగ్గించాలని పేర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15,27,523 మంది కూలీలు ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్నారు. వీరిలో హనుమకొండ జిల్లాలో 1,70,063, వరంగల్ జిల్లాలో 2,39,504, జనగామ జిల్లాలో 2,31,313 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2,41,166 మంది, మహబూబాబాద్ జిల్లాలో 4,63,513 మంది, ములుగు జిల్లాలో 1,81,946 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. వీరికి శ్రమకు దగ్గ ఫలితం దక్కడం లేదు. పని స్థలాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ పని చేయాల్సి వస్తోంది.

### పరిశ్రమల్లో కార్మికులు..

ఉమ్మడి జిల్లాలో మధ్య, భారీ తరహా పరిశ్రమలు, చిన్న సూక్ష్మతరహా పారిశ్రామిక యూనిట్లలతో మొత్తం 1,95,208 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో భారీ, మధ్య తరహా పరిశ్రమల్లో 13,146 మంది పని చేస్తున్నారు. చిన్న సూక్ష్మ తరహా పరిశ్రమల్లో 1,82,062 మంది విధులు నిర్వహిస్తున్నారు. భారీ మధ్య తరహా పరిశ్రమల్లో హనుమకొండ జిల్లాలో 6,342 మంది, వరంగల్ జిల్లాలో 3,214 మంది, జనగామ జిల్లాలో 1,227 మంది, మహబూబాబాద్ జిల్లాలో 1,350 మంది, ములగు జిల్లాలో 145 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 868 మంది పని చేస్తున్నారు. అలాగే చిన్న, సూక్ష్మతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల్లో హనుమకొండ జిల్లాలో 81,542 మంది, వరంగల్ జిల్లాలో 24,702 మంది, జనగామ జిల్లాలో 21,620 మంది, మహబూబాబాద్ జిల్లాలో 19,356 మంది, ములుగు జిల్లాలో 4762 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 19,356మంది పని చేస్తున్నారు. సంఘటిత రంగంలో పని చేస్తున్నా వీరు కూడా శ్రమదోపిడీకి గురవుతున్నారు. శ్రమకు తగ్గ వేతనం లభించడం లేదు. పని గంటలు కూడా ఎక్కువే. కార్మికశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి కార్మికుల పనిస్థితిగతులను, వారికి చెల్లిస్తున్న వేతనాల గురించి ఆరా తీయాల్సి ఉన్నా అలాంటిదేమీ కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పది@93.55%



- టెన్త్ ఫలితాల్లో భూపాలపల్లి జిల్లా 22వ స్థానం
- 3,443 మంది విద్యార్థులకు 3,221 మంది ఉత్తీర్ణత
- బాలికలదే హవా

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 93.55 శాతం ఉత్తీర్ణత సాధించింది. రాష్ట్ర స్థాయిలో 22వ స్థానంలో నిలిచింది. జిల్లా నుంచి 3,443 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 3,221 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 1,615 మంది ఉత్తీర్ణులు కాగా, బాలురు 1,606 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలే ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా అత్యధిక మార్కులు సాధించడంలోనూ హవా కొనసాగించారు. పది మంది విద్యార్థుల్లో 8 మంది బాలికలే అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటుకున్నారు.

### జిల్లాలో టేకుమట్ల, మొగుళ్లపల్లి టాప్

జిల్లాలో 11 మండలాలు ఉండగా టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. 99 శాతం ఉత్తీర్ణులు కావడంతో ఆయా మండలాల ఉపాధ్యాయులు సంబురాలు చేస్తున్నారు. అలాగే మండలాల వారీగా పరిశీలిస్తే భూపాలపల్లి మండలం నుంచి 775 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 16 మంది ఫెయిల్ అయ్యారు. 97శాతం ఉత్తీర్ణత సాధించారు. చిట్యాలలో 339 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. 25 మంది ఫెయిల్ అయ్యారు. 92శాతంలో నిలిచారు. గణపురంలో 390కి గాను ఒకరు గైర్హాజరు కాగా, ఏడుగురు ఫెయిల్ అయ్యారు. 97శాతంలో నిలిచారు. కాటారంలో 618 మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. 25 మంది ఫెయిల్ అయ్యారు. 95శాతం దక్కించుకున్నారు. మహదేవపూర్‌లో 383 మంది హాజరుకాగా, 115 మంది ఫెయిల్ అయ్యారు. 69శాతంలో నిలిచి వెనుకబడిపోయారు. మల్హర్‌లో 152 మందికి గాను 24 మంది ఫెయిల్ అయ్యారు. 84శాతంలో నిలిచారు. మహాముత్తారంలో 154 మంది హాజరుకాగా, ఒకరు ఫెయిల్ అయ్యారు. 99శాతం నమోదు చేసుకున్నారు. టేకుమట్ల మండలంలో 136కు గాను ఒక్కరే అనుత్తీర్ణుడు కాగా 99 శాతంలో నిలిచారు. మొగుళ్లపల్లిలో 263 మందికి గాను ఒక్కరే ఫెయిల్ అయ్యారు. ఈ మూడు మండలాలు 99 శాతంలో నిలిచి జిల్లాలో టాపర్ స్థానాన్ని దక్కించుకున్నాయి. అలాగే పలిమెల మండలంలో 20 మంది పరీక్షలు రాయగా నలుగురు ఫెయిల్ అయ్యారు. 80శాతంలో నిలిచారు. రేగొండలో 219 మందికి గాను ముగ్గురు ఫెయిలై 98 శాతాన్ని దక్కించుకుంది. 3,449 మందికి గాను ఆరుగురు గైర్హాజరు కాగా, 222 మంది ఫెయిల్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 3,221 మంది ఉత్తీర్ణత సాధించి 93.55 శాతాన్ని దక్కించుకున్నారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించిన మాంటిస్సోరి

భూపాలపల్లి పట్టణంలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల నుంచి 159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇందులో వైష్ణవి 574 మార్కులు సాధించి జిల్లాలో రెండవ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే జాహ్నవి 572, త్రిష, హరిణి, అక్షిత్‌లకు 568 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ గండ్ర సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీన్‌జోస్, డైరెక్టర్లు నూకల శ్రీనివాస్, రాజిరెడ్డి విద్యార్థులను అభినందించారు.

### సత్తా చాటిన బాలికలు..

గణపురం మండలంలోని ఎంజేపీ బాలికల పాఠశాల నుంచి గజ్జల సంధ్య 586 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. అలాగే కాటారం మండలంలోని మాంటిస్సోరి ప్రైవేటు పాఠశాల నుంచి ఆకుల వైష్ణవి 586 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. భూపాలపల్లి కేజీబీవీ నుంచి గడ్డం శివాంజలి 572 మార్కులు సాధించింది. కాటారం ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నల్లాల మణిదీప్ 572 మార్కులు సాధించారు. మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట జడ్పీహెచ్ఎస్ నుంచి కదూరు మేఘన 558 మార్కులు సాధించింది. కాటారం మండలం గంగారం మోడల్ స్కూల్ నుంచి షేక్ సనా 556 మార్కులు సాధించారు. భూపాలపల్లిలోని షైనార్టీ స్కూల్ నుంచి బండారి శివ యాదవ్ 555 మార్కులు సాధించాడు. కాటారం మండలం దామెరకుంట సోషల్ వెల్ఫేర్ నుంచి కనుకుల లక్ష్మీప్రసన్న 554 మార్కులు సాధించింది. కాటారం మండలం మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి జాగరి ప్రగతి 550 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌లుగా నిలిచారు. అయితే జిల్లాలోని 11 మండలాల నుంచి కాటారం మండలానికి అత్యధిక మార్కులు రావడం విశేషం. ఈ సందర్భంగా డీఈవో ముద్దమల్ల రాజేందర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## రెండు రోజులకోసారి వస్తా..

- పుష్కరాల పనులు వేగవంతం చేయాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కాళేశ్వరంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కాళేశ్వరంలో పుష్కరఘాట్ పనులను పరిశీలిస్తున్న మంత్రి దుద్దిళ్ల

మహదేవపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల సమయం దగ్గరికి వచ్చింది.. పనులు వేగవంతం చేయాలి.. అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని, సరైన సమయంలో పనులు పూర్తిచేయకుంటే కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయకపోవడం వల్లే పనుల్లో ఇంత జాప్యం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వరంలోని వీవీఐపీ ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం, వైద్యశాలను పరిశీలించారు. ప్రతీ రెండు రోజులకోసారి వస్తా.. పనులు ఎందుకు పూర్తికావో చూస్తా.. నిధులు విడుదల చేశాం.. అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.. ఎందుకింత నిర్లక్ష్యం అంటూ అధికారులపై మంత్రి గరమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రంగా చేయాలని సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదని, అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. మే 15వ తేదీ నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్నందున కూలీలను పెంచి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. కాళేశ్వరంలోని బస్టాండ్ నుంచి పుష్కరఘాట్, దేవాలయం, ఇతర ప్రాంతాలకు ట్రాఫిక్ విధానంపై ఎస్పీ కిరణ్‌ఖరేతో మంత్రి చర్చించారు. ట్రాఫిక్ ప్లాన్‌ను మంత్రికి ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమన్వయ లోపం.. పనులకు శాపం..

అధికారుల సమన్వయ లోపం.. పనులకు శాపంగా మారింది.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మంత్రి ఆదేశాలను అధికారులు లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారు. మాకెందుకులే అని పట్టించుకోవడం లేదు. సరస్వతీ పుష్కరాలకు ఇంకా 15 రోజులు మాత్రమే గడువున్నా పనులు సగం వరకే వచ్చి ఆగాయి.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యాసంగి పంట కొనుగోళ్ల వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం వలన హనుమకొండ జిల్లాకు కేటాంచిన మిల్లుల్లోకి ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లోకి ఈ రబీ సీజన్ ధాన్యాన్ని కేటాయించవద్దని అధికారులను ఆదేశించారు. రైతు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు అధైర్య పడవద్దన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి
- మంత్రికి, కలెక్టర్‌కు ఆదివాసీ సంఘాల వినతి
- ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి ఆదివాసీలకు స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించాలని ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో, కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ దివాకరను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కాగా సీతక్క సానుకూలంగా స్పందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి కేంద్ర బలగాలను వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మావోయిస్టుల కోసం చేస్తున్న గాలింపు చర్యల వలన ఆదివాసీ యువత భయాందోళనకు గురవుతున్నారని, దీంతో వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు పిలిచినప్పుడు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చల వల్ల అందరికీ మంచి జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ, గోర్‌సభ, శాంతి చర్చల కమిటీ, ములుగు జిల్లా సాధన సమితి, ట్రైబల్ డెమోక్రటి ఫెడరేషన్, ఎల్‌హెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, మేడారం ట్రస్ట్‌బోర్డు, ఏఎస్‌యూ, న్యూడెమోక్రసీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు లక్ష్మయ్య, జైసింగ్ రాథోడ్, శ్రావణ్‌కుమార్, రామ్మూర్తి, భిక్షపతి, ఉదయ్‌సింగ్, వెంకటేశ్వర్లు, రాజన్న, సమ్మయ్య రాథోడ్, లచ్చు పటేల్, నర్సయ్య, రవి, కన్నయ్య, కృష్ణ, బాలకృష్ణ, సోమన్న, జనార్దన్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.





ములుగులో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాసంగి పంట కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. మే నెలలో కేంద్రాలకు అధికంగా ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. రైస్ మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. అవసరమైతే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలన్నారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు సమస్యలు రాకుండా చూడాలన్నారు. రైస్‌మిల్లర్లు నిబంధనల ప్రకారం నడుచుకునేలా జిల్లా కలెక్టర్లు చూడాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంపత్‌రావు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు పరిష్కార మార్గం చూపాలి

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్**

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. బుధవారం భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులపై పైలెట్ ప్రాజెక్టుల జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఆర్డీవో వెంకటేశ్వర్లు, రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. ఆగమాగం

- విరిగిన చెట్లు.. తడిసిన ధాన్యం
- పిడుగుపాటుతో ప్రజల భయాందోళన



చిట్యాల మండలంలో ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్టు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన అకాల వర్షంతో జనం అతలాకుతలం అయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కొంతమంది రైతులు కల్లాల్లో పోసుకున్న వరి ధాన్యం తడిసి ముద్దయింది. మహాముత్తారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పిడుగు పడడంతో అక్కడే పనిచేస్తున్న పది మంది రైతులు ఉలిక్కిపడ్డారు. భయాందోళనతో పరుగులు తీశారు. భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీల్లో చెట్లు విరిగిపడ్డాయి. శాంతినగర్‌లో ఓ చెట్టువిరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ అంతరాయం కలిగింది. కానీ, తృటిలో ప్రమాదం తప్పిందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కాటారం మండలంలో భారీగా వర్షం కురవడంతో కల్లాల్లోని వరి ధాన్యం తడిసిపోయిందని రైతులు తెలిపారు. కోయడానికి సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. మహదేవపూర్‌లో ఓ మోస్తారుగా వర్షం కురిసింది. మిగతా మండలాల్లో ఈదురుగాలులు వీచాయి. ఉరుములు మెరుపులతో వర్షం రావడంతో విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

### ములుగు జిల్లాలో...

ములుగు: జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం రాత్రి గంటపాటు కురిసిన అకాల వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కల్లాల్లోని ధాన్యం తడిపోయింది. జిల్లాలోని పలు మండలాల్లో పిడుగులతో కూడిన వర్షం కురిసినట్లు తెలుస్తోంది.

# నేడు మేడే వేడుకలు

- సంబరాలకు సన్నద్ధమైన శ్రామిక సంఘాలు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు.. వారి పోరాటాలు, విజయాలను గుర్తు చేసుకునేందుకు జరుపుకునే మేడే వేడుకలు గురువారం జరుగనున్నాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని సంబురాలు జరుపుకునేందుకు సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, భవన నిర్మాణం, సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మిక సంఘాలు సమాయత్తం అయ్యాయి. సింగరేణి అనుబంధ సంఘాలైన ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో సుమారు 20 జెండాల ఆవిష్కరణలు చేయనున్నారు. వీటితో పాటు ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, టీబీజీకేఎస్, సీఐటీయూ, ఇతరత్రా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సైతం మేడే వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు నిర్వహించుటకు కార్యాచరణ రూపొందించుకున్నారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్, జయశంకర్ విగ్రహాన్ని తోరణాలతో అందంగా బుధవారం అందంగా ముస్తాబు చేశారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్‌లో బుధవారం ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 20న నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కొత్తగా 4 లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకరావడం దారుణమన్నారు. వాటి వల్ల కార్మికుల హక్కులకు భంగం వాటిల్లనుందని మండిపడ్డారు. కేంద్రం అవలంబిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, ఈ సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, ఏఐటీయూసీ క్యాతరాజు సతీష్, ఐఎన్‌టీయూసీ కోల నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# నష్ట పరిహారం చెల్లింపు విషయంలో గందరగోళం

- మొక్కజొన్న రైతులను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమవుతున్న బాండ్ ఆర్గనైజర్లు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు



మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏవోను ప్రశ్నిస్తున్న రైతులు

వాజేడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మొక్కజొన్న విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు చెల్లించే పరిహారం విషయంలో గందరగోళం నెలకొంది. గత రెండు నెలలుగా వాజేడు, వెంకటాపురం మండలాల్లో వివిధ బహుళ జాతి కంపెనీలకు చెందిన మొక్కజొన్న పంటను వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో ఇద్దరు రైతులు సైతం ఆత్మహత్య చేసుకున్న సంఘటన విధితమే. దీనిపై రైతు, ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళనలు నిర్వహించారు. జాతీయ ఎస్టీ కమీషన్ సైతం స్పందించింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత కంపెనీ ఆర్గనైజర్లతో మాట్లాడి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. ఇప్పటి వరకు బాగానే ఉన్నప్పటికి ఇక్కడే సంబంధిత ఆర్గనైజర్లు అటు అధికారులను, ఇటు రైతులను తప్పుదోవ పట్టించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నష్టపరిహారం చెల్లింపులో రైతులను మూడు కేటగిరీలుగా విభజించారు. ఏ కేటగిరి కింద రైతులకు ఎకరాకు రూ.85వేలు, బీ కేటగిరి రైతులకు రూ.75వేలు, సీ కేటగిరి రైతులకు రూ.65వేలు చెల్లించేలా అంగీకారమైంది. ఈ క్రమంలో రైతులకు పెట్టుబడుల రూపంలో చెల్లించిన నగదును మినహాయించుకొని మిగిలిన మొత్తం చెల్లించేలా తీర్మానించారు. అయితే ఇక్కడ రైతులను సదరు ఆర్గనైజర్లు మోసం చేసేందుకు సిద్ధమయ్యారు.

ఈ క్రమంలో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతులను పిలిచి ఆర్గనైజర్ల వద్ద తీసుకున్న అప్పు గురించి అంగీకార పత్రం రాయించి ఇమ్మని కోరారు. తీసుకున్న అప్పు ఒక విధంగా ఉంటే ఆర్గనైజర్లు చూపిన అప్పు మరోలా ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదాహరణకు ఒక రైతు సంబంధిత కంపెనీ ఆర్గనైజర్ నుంచి రెండు ఎకరాలకు రూ.40వేలు అప్పు తీసుకుంటే సదరు ఆర్గనైజర్ రికార్డులో రూ.లక్షపైన అప్పు తీసుకున్నట్లు ఉండటంతో రైతులు ఖంగుతిన్నారు. అదేవిధంగా ఒక రైతు నాలుగు ఎకరాలు సాగుచేస్తే రెండు ఎకరాలు మాత్రమే సాగు చేశాడని ఆర్గనైజర్లు చూపడం గమనార్హం. దీనిపై రైతులు ఏవో మహేష్‌ను నిలదీశారు. తమకు వచ్చిన నివేదిక ప్రకారమే అంగీకార పత్రాలు అడుగుతున్నామని రైతులకు వివరించే ప్రయత్నం చేయగా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 500 మందికి పైగా రైతులు మొక్కజొన్నను వేసి నష్టపోగా కేవలం 220 మంది రైతుల పేర్లే రావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీల ఆర్గనైజర్లు ఇక్కడకు రావాలని డిమాండ్ చేశారు. ఇదేక్కడి మోసమని, రైతులను కేటగిరీల వారీగా విభజించడం ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు బాధిత రైతులు ములుగుకు వెళ్లారు. అసలే పంట వేసి తీవ్రంగా నష్టపోయిన విషయంలో సంబంధిత ఆర్గనైజర్లు అవలంబిస్తున్న తీరు తమను అవమానపరిచే విధంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పదో తరగతిలో 97.64 శాతం ఉత్తీర్ణత

- రాష్ట్ర స్థాయిలో ములుగు జిల్లాకు 8వ స్థానం

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో ములుగు జిల్లా 97.64 శాతం ఉత్తీర్ణత సాధించింది. ములుగు జిల్లా మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. 2023-24 విద్యా సంవత్సరంలో 13వ స్థానంలో ఉన్న జిల్లా ఈ విద్యా సంవత్సరంలో 5 స్థానాలు మెరుగుబరుచుకుని 8వ స్థానంలో ఉంది. జిల్లా వ్యాప్తంగా 115 ప్రభుత్వ, ఆశ్రమ, ప్రైవేటు పాఠశాలలు ఉండాగా 3,134 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాశారు. ఇందులో 1,608 మంది బాలురు, 1,526 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 1,560 మంది బాలురు, 1,500 మంది బాలికలు మొత్తంగా 3,060 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

## రామప్పను సందర్శించిన విదేశీయులు

వెంకటాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయాలన్ని స్వీడన్, డెన్మార్క్ దేశాలకు చెందిన హన్స్, క్రైస్టమర్ బుధవారం సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వరుడికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేశ్ రామప్ప చరిత్రను వారికి వివరించారు. అనంతరం వారు రామప్పలో సరదాగా గడిపి తిరుగు ప్రయాణం అయ్యారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించాలని, హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌గా ఇమామ్ బాబా షేక్

చిట్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన తహసీల్దార్‌గా ఇమామ్ బాబా షేక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత తహసీల్దార్ హేమ దీర్ఘకాలిక సెలవులపై విదేశాలకు వెళ్లారు. దీంతో చిట్యాల నాయబ్ తహసీల్దార్(ఎలక్షన్) జిల్లాకేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఇమామ్ బాబా షేక్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు చిట్యాల తహసీల్దార్‌గా ఇమామ్ బాబా షేక్ బాధ్యతలు స్వీకరించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

కన్నాయిగూడెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బహింగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఇనిగాల వెంకటేష్ మందుబాబులను హెచ్చరించారు. బుధవారం ఏటూరునాగారం-తుపాకులగూడెం ప్రధాన రోడ్డులోని ఏటూరు వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. మద్యం తాగి పట్టుపడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మండలంలోని ముప్పనపల్లికి చెందిన ఒక వ్యక్తి, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటిపల్లికి చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిల్లర్ల ఆగడాలను అరికట్టాలి

గోవిందరావుపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తరుగు పేరుతో రైతుల శ్రమను దోచుకుంటున్న రైస్‌మిల్లర్ల ఆగడాలను అరికట్టాలని మండలకేంద్రానికి చెందిన జెట్టి రాజు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతు ఆరుగాలం కష్టించి పంట పండించగా ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోవడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని అమ్ముకోబోతే రైస్‌మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాల్‌కు 10కిలోల చొప్పున కట్ చేస్తూ తమ శ్రమను దోచుకుంటూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## రెండు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

వాజేడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వాజేడు పోలీసులు బుధవారం నిషేధిత నల్లబెల్లంను పట్టుకున్నారు. ఎస్సై ఎస్.రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. జిల్లా ఎస్పీ శబరీశ్, ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ ఆదేశాలతో సీఐ కుమార్ ఆధ్వర్యంలో గుమ్మడిదొడ్డి వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి వస్తున్న కారు పోలీసులను చూసి ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఆ కారును వెంబడించి పట్టుకోగా రెండు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 20 కిలోల పటిక లభ్యమైంది. కారులో ముగ్గురు ఉండగా ఒక వ్యక్తి పరారయ్యాడు. కారును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని బొమ్మనపల్లికి చెందిన ముప్పిరి రాజ్‌కుమార్, మండపాకకు చెందిన చిచ్చడి శరత్‌లు పట్టుబడగా, వెంకటాపురం మండలం పాత్రాపురంకు చెందిన బట్టా శ్రీను తప్పించుకున్నాడు. పట్టుబడిన నల్లబెల్లం విలువ రూ.84 వేలు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు గంగాధర్, చంద్రప్రకాష్, కానిస్టేబుళ్లు వెంకన్న, ఆంజనేయులు, జనార్దన్, చంద్రశేఖర్, రాకేష్, మొయిన్‌పాషా పాల్గొన్నారు.

## అడవిలో మద్యం తాగుతున్న ఐదుగురిపై కేసు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అభయారణ్యంలో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు దక్షిణ విభాగపు రేంజ్ అధికారి అబ్దుల్ రహ్మాన్ తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లి దక్షిణ విభాగం రేంజ్ పరిధిలో హనుమాన్‌నగర్ బీట్‌లో గల అభయారణ్యంలో అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ మండలంలోని బురా వినయ్, గోటుకుల రాకేష్, కార్డురి రాకేష్, గోటుకుల గణేష్, బత్తుల శ్రీనివాస్ ప్లాస్టిక్ వస్తువులను పడవేసి మద్యం సేవిస్తున్నారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎఫ్ఆర్వో తెలిపారు. అంతేకాకుండా వారికి రూ.15వేల జరిమానా విధించినట్లు చెప్పారు. అభయారణ్యంలోకి అనవసరంగా ఎవరూ రావొద్దని, అటవితో పాటు మూగజీవాలకు హాని కలిగించే ఆ చర్యలను కూడా ఉపేక్షించేది లేదని ఎఫ్ఆర్వో హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్వో ప్రహ్లాద్, సెక్షన్ ఆఫీసర్ నారాయణ, బాలాజీ, బీట్ ఆఫీసర్లు దయానంద్, ఖాజా మొయినొద్దీన్, అనూష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రొయ్యూరులో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొయ్యూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 1 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఆర్బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) ఏటూరునాగారం బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్బీఎస్‌కే బృందం పిల్లల శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు పోషకాహార లోపం తలెత్తకుండా ఉండాలంటే తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం ఇవ్వాలని, బయట లభించే జంక్ ఫుడ్‌ను చిన్నారులకు అలవాటు చేయవద్దని, చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అధికారులు తల్లిదండ్రులకు పలు ఆర్యోగ సూత్రాలను అందజేశారు. అంతేకాకుండా, ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఏమైనా ఉంటే ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరహరి, ఫార్మాసిస్ట్ సిహెచ్.భాస్కర్, ఏఎన్ఎం రజిని, రొయ్యూర్ అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, జ్యోతి, కుసుమ, జగదంబ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్‌మెంట్ వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదు

- ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ రిటైర్‌మెంట్ వృత్తికే కాని, వ్యక్తిత్వానికి కాదని జిల్లా ఎస్పీ శబరీశ్ కొనియాడారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందుతున్న ములుగు 2వ ఎస్సై లక్ష్మారెడ్డి, పీసీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై రవీందర్, ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీఎస్ ఖాజా మొయినొద్దీన్, ఏటూరునాగారం పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామారావుల ఉద్యోగ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన హాజరై వారిని సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పదవీ విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో శేష జీవితం ఆనందంగా గడపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్‌బీ సీఐ శంకర్, ఆర్ఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ విరమణ సహజం - మంత్రి సీతక్క

ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని, రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులను మంత్రి సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ఏటూరునాగారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీడివాగు మూలమలుపు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగపేట మండలం వైపు నుంచి ధాన్యాన్ని బస్తాల్లో లోడ్ చేసుకొని వస్తున్న డీసీఎం వాహనం జీడివాగు సమీపంలో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బోల్తా కొట్టిన డీసీఎం వాహనాన్ని గమనించిన ప్రయాణికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం డ్రైవర్‌ను స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# టాటా మ్యాజిక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- ఏడుగురు ప్రయాణికులకు గాయాలు

చిట్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామచంద్రాపురం గ్రామ శివారులో టాటా మ్యాజిక్ వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం చిన్నకొమురు గ్రామానికి చెందిన 10 మంది భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరుగుతున్న వివాహ శుభకార్యానికి హాజరయ్యేందుకు టాటా మ్యాజిక్ వాహనంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో రామచంద్రాపురం శివారు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో టాటా మ్యాజిక్ వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తొట్ల సునీత, ముత్యాల రాజమ్మ, తిరుపతి, జంగ మధు, పెల్లి శ్రీనివాస్, తొట్ల కొమురయ్య, సామని రజితకు గాయాలు కాగా, క్షతగాత్రులను చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు.

తొట్ల సునీత, ముత్యాల రాజమ్మకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, టిప్పర్ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# పది ఫలితాలలో శారద విద్యాలయం ప్రభంజనం



పది ఫలితాలలో ప్రతిభ చూపిన వారిని అభినందిస్తున్న సత్యనారాయణ

పరకాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పరకాల పట్టణంలోని శారదా విద్యాలయ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. కూనురు వర్షిత 580 మార్కులు, మార్క మంజునాథ్, తోట వైష్ణవి 565, గడ్డం శ్రావణ్ కుమార్ 556, ఇప్ప సాయి చరణ్, 550, రావుల రణధీర్ 548 మార్కులు సాధించారు. అలాగే 60 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు మార్క సత్యనారాయణ వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

## తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల సత్తా



సత్తా చాటిన క్రీడాకారులను సన్మానిస్తున్న జిల్లా తైక్వాండో అసోసియేషన్

ఏటూరునాగారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఇండియా-నేపాల్ మొదటి తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో ములుగు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ మేరకు స్వర్ణ, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను ములుగు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26, 27 తేదీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో ఇండియా, నేపాల్ దేశాల నుంచి క్రీడాకారులు పోటీపడ్డారు. ములుగు జిల్లా అసోసియేషన్ సభ్యురాలు చుంచ లావణ్య మాస్టర్ సీనియర్ మహిళా విభాగం 65 కేజీల కేటగిరిలో పాల్గొని స్వర్ణ పతకం సాధించారు. సీనియర్ పురుషుల విభాగంలో 61 కేజీల కేటగిరిలో మాస్టర్ సంతోష్‌కుమార్ రజత పతకం గెలుచుకున్నారు. కాగా, మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు మాస్టర్ చుంచ వెంకటేశ్వర్లు, నీరంజన్, అట్టం కృష్ణ మాస్టర్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సహకార వారోత్సవాలు ప్రారంభం



రైతుకు సహకారోత్సవాల లోగో టీషర్ట్ అందిస్తున్న మంత్రి

కాటారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సహకార వారోత్సవాలను బుధవారం రాత్రి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అంబేద్కర్ కూడలిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అనంతరం పలువురు రైతులకు సహకారోత్సవాల లోగోలతో కూడిన టీషర్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయనే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం శుభపరిణామమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంగా గుర్తించబడ్డ పీఏసీఎస్ రైతులకు మరింత ప్రోత్సాహకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో డీసీవో వాల్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రాజబాపు, హిమాకర్, సీఈవో సతీష్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ మహేశ్వరి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల సందీప్, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, భూపెల్లి రాజు, రమేష్‌రెడ్డి, కుమార్, సుజాత, శకుంతల, విక్రమ్, మహేష్, రమేష్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన మంత్రి

మహదేవపూర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి భూమి పూజ చేశారు. మహదేవపూర్ మండలంలో బుధవారం పర్యటించిన మంత్రి శ్రీధర్‌బాబు ఎల్కేశ్వరంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. తొలుత గ్రామంలో గద్ద రవి అనే గ్రామస్థుడి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి మరో రెండు ఇళ్లకు కొబ్బరికాయకొట్టి ముగ్గు తవ్వారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహప్రవేశాలకు పిలువాలంటూ సరదాగా సంభాసించారు. ఈసందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలపై మంత్రికి విన్నవించారు. అనంతరం బొమ్మాపూర్‌లో ఓ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో ప్రసాద్, కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

# మల్లూరు దేవస్థానం పాలక మండలిని ఆదివాసీలకే ఇవ్వాలి : జేఏసీ

మంగపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరులో గల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్, డైరెక్టర్లను పూర్తి పాలకమండలిని ఆదివాసీలకే ఇవ్వాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కార్యదర్శి పోలెబోయిన ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంగపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఆదినారాయణ మాట్లాడుతూ పూర్వం నుంచి దట్టమైన అడవులు ఉన్నప్పటికీ కాలి నడకన వెళ్లి ఆదివాసీలే ఆరాధ్య దైవంగా స్వామి వారిని పూజించేవారన్నారు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను ఆదివాసీ సంప్రదాయాల అలంకరించి సేవ చేస్తూ జాతరను ఘనంగా నిర్వహించేవారన్నారు. పూర్వం నుంచి నిత్యం ఆదివాసీలు కొలిచే దేవతామూర్తులుగా ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు దైవ దర్శనాలను అందజేసే పద్ధతి ఉండేదన్నారు. ఈ దేవస్థానం ఆదివాసీల ఆదరణలో ఉన్నందున పాలక మండలిని ఆదివాసీలతో నియమించాలని ఆదినారాయణ డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, నాయకులు అన్నెబోయిన సమ్మయ్య, తోలెంనర్సింహరావు, జబ్బనరేష్, తోలెం సుధాకర్, నల్లెబోయిన లక్ష్మణ్‌రావుదొర, పూనేం రాములు, కె.రవి పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

వెంకటాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రానికి చెందిన నాగమణి, సతీష్, శశికుమార్, ముకుందరావులు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. దీంతో సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను కనుగొని అందజేయడం జరిగిందని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాటారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ బుధవారం ప్రారంభించారు. రైతులు నాణ్యమైన వడ్లను తెచ్చి మద్దతు ధరను పొందాలని చైర్మన్ సూచించారు. వడ్లు కుప్పలు పోసి 15రోజులు గడిచాయని వెంటనే కాంటాలు ప్రారంభించాలని రైతులు కోరారు. కటింగ్‌లు లేకుండా సేకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వొన్న వంశవర్ధన్‌రావు, మాజీ సర్పంచ్ ఆత్మకూరి రాజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బండి రమేష్, అసిస్టెంట్ సీఈవో సతీష్, సిబ్బంది కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పోచమ్మ దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని సుభాష్‌కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో బుధవారం ప్రాణప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ రోజు ఒక్కరోజే కాకుండా ప్రతి నిత్యం దూపదీప నైవేద్యం ఉండేలా చూడాలని అన్నారు. ఈ దేవాలయానికి కావాల్సిన నిధులు రూ.10లక్షలు ఇవ్వడమేకాకుండా బోరు వేయించడం జరిగిందని తెలిపారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని బోనాలు నెత్తినబూని ప్రత్యేక ప్రదర్శనచేశారు. గుడి చుట్టూ తిరుగుతూ పూజలకు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, లట్ట రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని అప్పయ్యపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దళారులను నమ్మవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్, నాయకులు చోటమియా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.